విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 09, మార్చి 2023

ప్రజా సమస్యలపై పోరాడే పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : పశ్చిమ రాయల సీమ గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ పోతుల నాగరాజు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు ఏ.రణధీర్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.రామ్‌నాయక్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని రాజా వీధి, ఏబీఎం పాలెం, ఎస్‌పిజి పాలెం, కొత్తపేట,స్వరాజ్ నగర్, వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యావంతులైన మేధావి వర్గం ఓటు వేసే ఈ ఎన్నికల్లో ప్రలోభాలకు గురి కాకుండా రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ పోతుల నాగరాజుకు 198 ప్రజా సంఘాలు మద్దతు తెలుపుతున్నాయన్నారు.ఆయన ఉద్యమ నేపథ్యం, పోరాట పటిమ తెలుస్తుంది అన్నారు. పోతుల నాగరాజు ఇప్పటికే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు,పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నా రన్నారు. చట్టసభల్లో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల పై తప్పు, ఒప్పులను గ్రహించి ధైర్యంగా రాజకీయాలకు అతీతంగా చెప్పగలిగే స్థాయి పిడిఎఫ్అభ్యర్థులు నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు ఉన్నా యని, విజ్ఞులైన ఓటర్లు ఇటువంటి వారిని చట్టసభలకు పంపితే ప్రజా సమస్యలపై మరింతగా పోరాడుతారని ఆ అవకాశం వారికి కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఏదైనా సాధించాలంటే విద్యతోనే

విశాలాంధ్ర-డోన్ : డోన్ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మదర్ తెరిస్సా వెల్ఫేర్ అసోసియేషన్, ఏపీ మహిళా సమాఖ్య,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ అధ్యక్షతన డోన్ సబ్ కోర్టు జడ్జి తంగమణి, సిడిపిఓ శంషాద్ బేగం, డాక్టర్ మాధవిలత, ఉపాధ్యాయులు శారదా దేవి,జూనియర్ అసిస్టెంట్ ఉమాదేవి, లాయర్ కుమారిలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జడ్జి తంగమని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించా లన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అనుకున్నా రంగంలో రాణించాలంటే కాస్త కష్టపడాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ఐసిడిఎస్ సిబ్బంది విద్యపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఏదైనా సాధించా లంటే విద్యతోనే ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వై జర్లు పద్మ, తిప్పమ్మ,దేవకృప, అంజలి,సుగుణ, తదితరులున్నారు.

బొప్పాయికి చీరలే రక్షణ

విశాలాంధ్ర - చాగలమర్రి : బొప్పాయి పండ్లకు చీరలే రక్షణగా నిలుస్తున్నాయి. చిన్నవంగలి గ్రామంలో 200 ఎకరాల్లో రైతులు బొప్పాయి సాగు చేశారు. వైరస్ వల్ల పంట దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. చెట్లకు ఉన్న బొప్పాయి పండ్లను కాపా డుకోవడానికి రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. బొప్పాయి ఎండ ప్రభావంతో దెబ్బతింటున్నాయి. దీంతో కౌలు రైతు నాగార్జున పాత చీరలతో రెండు ఎకరాల బొప్పాయి తోటను కాపాడుకుంటున్నారు. ఒక్కో చీర రూ.20 ప్రకారం కొనుగోలు చేసి బొప్పాయి కాయలకు చుట్టేశారు. 1,500 మొక్కలను కాపాడుకునేందుకు చీరలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. పండ్లు కోసే వరకు దెబ్బతినకుండా ఉంటాయని కౌలు రైతు పేర్కొన్నారు. మరో కొంత మంది రైతులు ఇదేబాట పట్టారు.

ఉద్యోగులను ఓటు అడిగే హక్కు వైసీపీకి లేదు

విశాలాంధ్ర - వెలుగోడు : ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారిని ఓటు అడిగే హక్కు ప్రభుత్వానికి లేదని ప్రజా సంఘాల నాయకుడు జిల్లా అధ్యక్షులు వి. యేసు రత్నం, జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కె.రామదాసు, మండల అధ్యక్షులు వి.నాగమోహన్ ఆవాజ్ కమిటీ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ రఫీ, నాయకులు జి.భాష అన్నారు. వైయస్సార్ ప్రభుత్వము ఎన్నికల్లో గెలవడా నికి ఉద్యోగులకు కార్మికులకు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని శత్రువులుగా చూస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడుతూ నిర్బంధాన్ని కొనసాగిస్తూ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రేమ చూపిస్తుందని వారన్నారు. అధికారంలోకి వచ్చిన వారానికే సీపీఎస్ రద్దు చేస్తామని చేయలేద న్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న వాగ్దానం మర్చిపోయారని ప్రజలు ఉద్యోగులు కార్మికులు ప్రభుత్వ పాలసీలను ప్రశ్నించి పేదలకు న్యాయం చేసే విధంగా పోరాటం చేసేటువంటి వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేయాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పీడీఎఫ్ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకి మొదటి ఓటు వేసి వేయించి గెలిపించాలని అలాగే టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ఓటు వేసి వేయించి గెలిపించాలని వారు కోరారు.

మిర్చి యార్డు వల్ల రైతుల్లో ఆనందం

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : నంద్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం మిర్చి యార్డు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఉపయోగకరంగా ఉండడం వల్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారని నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పనలు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి మరియు ఎంపీపోచ. బ్రహ్మానందరెడ్డిలు ఈ ప్రాంతంలో మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వివరించడం జరిగిందన్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈనెల రెండవ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో స్థానిక మార్కెట్ యార్డ్ నందు మిర్చియార్డ్‌ను ఏర్పాటు చేశారన్నారు. అందువల్ల జిల్లా వ్యాప్తంగా రైతులందరూ ఈనెల రెండవ తేదీ నుంచి నేటి వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాలలో రైతులు పండించిన మిరప పంటను యార్డు నందు సరసమైన ధరలకు అమ్ముకోవడం చాలా సంతృప్తిగా ఉందన్నారు.కాగా సూపర్ టెన్ మిరప ధర 220నుండి 250రూపాయలు వరకు,తేజ మిరపరకం ధర 210నుండి230 రూపాయలకు అమ్ముకుంటున్నారన్నారు. గతంలో మన మిర్చి రైతులు గుంటూరు కి వెళ్లి నానా అవస్థలు పడుతుండే వారన్నారు. ప్రస్తుతము జిల్లా కేంద్రంలో యార్డు ఉండడం వల్ల నంద్యాల మండలంతో పాటు అన్ని మండలాల మిర్చి రైతులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారన్నారు. రైతులు మిరపను భద్రపరచుకోవడానికి ప్రస్తుతం నంద్యాల మిర్చి యార్డు నందు ఏడు ఏసీ గోడన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏడు ఏసీ గోడన్లులలో రైతులు మిరప భద్రపరుచుకోవడా నికి 100 టక్కుల వరకు అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 47వేల ఎకరాల మిరప పంటను రైతులు సాగు చేసుకుంటున్నరన్నారు. అధికంగా జిల్లాలోని సంజామల మండలంలో 6వేల ఎకరాల మిరప పంటను పండించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండడానికి మౌలిక వసతులు అలాగే క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ మనజీర్ జీలానిశమున్ కు పై సమస్యను గురించి నివేదిక పంపించామన్నారు. అందువల్ల త్వరలోనే వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని వారు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఏఎస్ఓ శశి రెడ్డి, సూపరింటెండు శ్రీనివాసులు, మధు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన సెపక్తక్రా క్రీడాకారులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్రస్థాయి పోటీలకు సెపక్తక్రా క్రీడాకారులు ఎంపికయ్యారు. పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి సెపక్తక్రా ఎంపిక పోటీలు బుధవారం జరిగాయి. ఈ పోటీలను జిల్లా సెపక్తక్రా చైర్మన్ నరసింహారెడ్డి ప్రారంభించారు. జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొనగా పదిమంది క్రీడాకారులను ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వీరు నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు నవనంది హైస్కూల్లోని క్రీడామైదానంలో జరగబోయే పోటీలలో పాల్గొంటారు. సేపక్ తక్రా జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణువర్ధన్ రెడ్డి, రుషికేశ్ వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, దేవేంద్ర, ప్రతాప్ , శ్రీనివాసరెడ్డి, నరసింహుడు, మౌలాలి, రవి, మనోహర్, దాదా పీర్ ,సుబ్బయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

విష గుళికలు తిని గేదె మృతి

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని పాత బస్టాండ్ వీధికి చెందిన పసుపుల శ్రీనివాసులు చెందిన గేదె విష గుళికల ఆహారం తిని ఒకటి మృతి చెందగా మరొకటి తీవ్ర అస్వస్థకు గురి అయింది.బాధితుడు తెలిపిన వివరాల మేరకు బుధవారం మేత మేసేందుకు వెళ్లి అడ్డవాగు సమీపంలోని పొలంలో తెగుళ్ల నివారణ కోసం వాడిన విషపు గుళికలు వేసిన మొక్కజొన్న పంటను తిని పాడి గేదే అక్కడికక్కడే మృతిచెందగా మరో గేదే తీవ్ర అస్వస్థకు గురైంది. విషయం తెలుసుకున్న పశు వైద్యులు చికిత్స చేసిన ఫలితం లేదు. అస్వస్థకు గురైన పశువుకు చికిత్సలు చేసి ప్రాణాపాయం నుండి కాపాడారు.దీంతో సుమారు లక్ష రూపాయల మేర నష్టపోయానని పశువుల భీమా వర్తింప చేసి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణంలోని సాయిరాం డిగ్రీ కాలేజీ నందు బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు కళాశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఉమెన్ రైట్స్ గురించి, మహిళల చట్టాల గురించి, రాగింగ్ చేసే వాటిపై సాయిరాం కాలేజీ విద్యార్థి, విద్యార్థిను లకు వాటి చట్టాలు, మహిళల హక్కుల గురించి వివరించి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, బార్ అసోసియే షన్ అడ్వకేట్ వెంకట్ రాముడు, మద్దయ్య, కేశాలు, వాలంటరీ సోషల్ వర్కర్ శోభారాణి, మహిళలు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నందికొట్కూరు : మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం, వేల్పుల జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలోని స్కూల్ విద్యార్థులు గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ ఇంటికి వెళ్లి ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. సర్పంచ్ మాధవరం సుశీలమ్మ మాట్లాడుతూ మహిళలే ఈ ప్రపంచానికి నిజమేనా దిక్సూచిలు అన్నారు. వారి పనులు, ధైర్యసహసాలు ఆలోచనలతో సమాజ శ్రేయస్సుకు పాటుపడడం జరుగుతుందన్నారు.

విశాలాంధ్ర - బనగానపల్లి : బనగానపల్లె పట్టణంలోని మాజీ శాసనసభ్యులు బీసీ జనార్ధన్ రెడ్డి స్వగృహం నందు వారి సతీమణి రాష్ట్ర థాయ్ బాక్సింగ్ చైర్ పర్సన్ బీసీ ఇందిరా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించడం జరిగింది. ముందుగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆటల పాటల్లో పాల్గొన్న ప్రతి మహిళకు బీసీ ఇందిరా రెడ్డి ప్రోత్సాహ బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రుద్రవరం : సృష్టికి మూలమైన మాతృమూర్తులను గౌరవించడం మనందరి బాధ్యత అని సీనియర్ న్యాయవాది తిరుపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఆళ్లగడ్డ అయిదవ అదనపు జిల్లా జడ్జి వాసు ఆదేశాల మేరకు స్థానిక వెలుగు కార్యాలయం లో పానెల్ న్యాయవాది సుబ్బయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు శివప్రసాదరావు, రమణయ్య, మహిళా న్యాయవాది చందన, నరసయ్యలు మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలను మోస్తూ ఓర్పు సహనాలకు ప్రతిరూపాలైన మహిళలను గౌరవిస్తూ సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాడు నేడు ఇన్చార్జి దేవానందం , మహిళా మాజీ సర్పంచులు నరసమ్మ, లక్ష్మీదేవి ఆయా గ్రామాలకు చెందిన పలువురు మహిళలు ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో బుధవారం రాత్రి జరిగిన గరుడోత్సవంతో లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవ మూర్తి ప్రహ్లాద వరద స్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఆసీనులను చేసి సాంప్రదాయం ప్రకారం అహోబిల మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా అహోబిల మఠం చేరుకున్న స్వామి కొలువుదీరిన పల్లకికి పీఠాధిపతి స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోనేరు వద్ద ఉత్సవమూర్తులు శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. సుదర్శన మూర్తి, నిత్య ఉత్సవమూర్తిలకు కోనేరులో చక్రవారి తీర్థ స్నానం గావించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ద్వాదశరాధనం పుష్పయాగం కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. రాత్రి ప్రహ్లాద వరద స్వామినీ గరుడ వాహనంపై ఆశీనులను చేసి అహోబిల మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం వెంట చెంచులు చేస్తున్న నృత్యాలు, విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ గరుడ ఉత్సవ కార్యక్రమానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చివరగా ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కాగా ఎగువ అహోబిలంలో గరుడోత్సవ కార్యక్రమం బుధవారం తెల్లవారుజామున వరకు కొనసాగింది..

నేటి నుండి తెప్పోత్సవాలు.....: గత నెల 25నుండి ప్రారంభమైన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఎనిమిదవ తేదీ రాత్రి గరుడోత్సవంతో ముగిశాయి. ఈ బ్రహ్మోత్సవాలలో అలసిపోయిన స్వామి, అమ్మవార్లను సేద తీర్చేందుకు మూడు రోజులపాటు ఆలయ సమీపంలో ఉన్న కోనేరులో తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. స్వామి, అమ్మవార్లను 9,10,11వ తేదీలలో మూడు రోజుల పాటు కోనేరులో విహరింప చేస్తారు.

రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలికిన జగన్

విశాలాంధ్ర - నంద్యాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి దేశంలోని దిగ్గజ కంపెనీలతో విశాఖ పట్టణంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా 13లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగింది. కోట్లాది రూపాయల పెట్టుబడులు చేయడం జరిగింది. పెట్టడానికి కేవలం వారికి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డిపై ఉన్న నమ్మకం, విశ్వాసం, భరోసా అని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి తెలిపారు. ఈ మేరకు నంద్యాల పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోని ఏరాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి 13లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ఒక వేదికగా నిలిచిందన్నారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి సాధించడమే కాకుండా ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. చంద్రబాబు సూట్ కేస్ కంపెనీలు, బోగస్ కంపెనీల పేరుతో ప్రజలను మభ్యపెట్టారని ఎద్దేవా చేశారు. శిల్పాభువనేశ్వరరెడ్డి, మహానంది దేవస్థానం చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, దేశు వెంకటరామిరెడ్డి, వ్యవసాయ కమిటీ చైర్మన్ మహానంది శర్వారెడ్డి, నగభూపాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

కన్పించి..మాయమై

విశాలాంధ్ర - కొత్తపల్లి : రెండ్రోజుల పాటు పులి పిల్లలకు దూరమైన తల్లిపులి మూడో రోజైన బుధవారం సాయంత్రం 4:30 గంటల సమయంలో పెద్ద గుమ్మడాపురం-ముసలిమడుగు గ్రామాల మధ్యలో ఉన్న నీలగిరి మొక్కల్లోని కాల్వ వెంట పిల్లల కోసం అన్వేషిస్తుండగా గొర్ల కాపరులు గమనించారు. భయాందోళన చెందిన వారు కేకలు వేయడంతో ఆ పులి మళ్లీ అడవిలోకి పరుగులు తీసింది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు హుటాహుటినా పిల్ల కూనలను తీసుకుని తల్లి చెంతకు చర్చేందుకు పరుగులు తీశారు. అయితే ఆ తల్లిపులి ఎక్కడికెళ్లిందనేది ప్రశ్నార్థంగా మారింది. అటవీ సిబ్బంది కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఆత్మకూరు, మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్లు, రేంజర్లు, ఇతర కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పెద్దపులి అడుగు జాడలను గుర్తించారు. ప్రధానంగా నీలగిరి మొక్కల ప్లాంటేషన్ పక్కనున్న కాల్వ మీదుగా ఎక్కడికెళ్లిందనే విషయంపై ఆరా తీస్తున్నారు. అందుకోసం గొర్రెల కాపరులతో కలిసి అటవీ అధికారులు అచ్చిరెడ్డి కుంట తదితర ప్రాంతాల్లో తల్లిపులి పాదముద్రలను గుర్తించారు. ఎక్కడైనా కన్పిస్తే పిల్లలను వాటి వద్దకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఊపిరి పీల్చుకునేలోపే మళ్లీ పరిస్థితి మొదటికి రావడంతో అటవీ అధికారులు నిరాశకు లోనయ్యారు. ఎలాగైనా గాలించి పిల్లలను తల్లి చెంతకు చేరుస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దాదాపు 350 మంది సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. తల్లి పులి కన్పించగానే పిల్లలను వాటి చెంతకు చేరుస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు త్రోబాల్ జట్టు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : జాతీయస్థాయి పోటీలకు సబ్ జూనియర్ త్రో బాల్ జట్టు ఎంపికైంది. పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సబ్ జూనియర్ త్రోబాల్ సెలక్షన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను డాక్టర్ నాగస్వరం నరసింహం, సెపక్తక్రా చైర్మన్ నరసింహారెడ్డిలు ప్రారంభించారు. ఈ పోటీలకు దాదాపు 100 మంది పాల్గొన్నారు. ఎంపికైన సబ్ జూనియర్ త్రో బాల్ జట్టు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు చత్తీస్గడ్ రాష్ట్రంలోని భిలాయిలో జరిగే 30 వ జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలలో పాల్గొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, దాదా పీర్ ,దేవేంద్రుడు, ప్రతాప్, మౌలాలి, బాబు ,శ్రీను, రవి ,సుబ్బయ్య, మబాష తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తగా అవార్డు

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని 17వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న చంద్రకళ ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తగా అవార్డును స్వీకరించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా జాయింట్ కలెక్టరు నిశాంతి, జిల్లా జడ్జి పద్మజా, జిల్లా ప్రాజెక్టు అధికారుల చేతుల మీదుగా ఏర్పాటు చేసి అవార్డుల స్వీకరణ కార్యక్రమంలో చంద్రకళ పాల్గొని అవార్డును అందుకున్నారు. విధినిర్వహణలో సక్రమంగా ఉంటూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచినందుకు అవార్డును ఇచ్చారని అంగన్వాడీ కార్యకర్త తెలియజేశారు. చంద్రకళకు అవార్డు రావడంతో పలువురు ఆమెను అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ముమ్మర ప్రచారం

విశాలాంధ్ర - వెలుగోడు : ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తుండతో అన్ని పార్టీల ప్రచారం ఊపందుకుంది. వెలుగోడు పట్టణంలోని ద్వారకా నగర్, సి.పి.నగర్ లలో బుధవారం బిసి.సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘు రాముడు , కె.వి.పి.ఎస్ జిల్లా కార్యదర్శి రామదాసు,సిఐటియు మండల అధ్యక్షుడు నాగమోహన్ మిగతా సిఐటియు నాయకులు పశ్చిమ రాయల సీమ జిల్లాలలో మార్చి 13న జరిగేపట్టభద్రుల ఎన్నికల్లో పిడి ఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు తరుపున ఇంటింటా తిరిగి ప్రచారం చేయడం జరిగింది.ప్రతి పట్టబద్రులు, ఉపాధ్యాయులు వరుస నెంబర్ 27కు ఎదురుగా (1)అని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్య ధిక మెజారిటీతో గెలిపించాలని వారన్నారు.వైఎస్ఆర్సిపి అభ్యర్థి వెన్నపూసల రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైసిపి నాయకులు, టిడిపి. ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామ గోపాలరెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

విశాలాంధ్ర - పాముల పాడు : మండల పరిధి,లోని ఇస్కాల గ్రామంలో బుధవారం వెంపెంట పశువైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, సందర్భంగా పశువులపై వాటికి వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన పశువులకులో టీకాలు తప్పనిసరిగా వేయించాలని, కొద్ది అందరికీ రుప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గిపోవడం, లేక దూడల మరణాలు తదితర వాటిపై రైతులు జాగ్రత్తగా ఉండాలనే అవసరమైతే వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యులకు చూపించాలని ఆయన తెలిపారు 100 ఎద్దులు,140గేదెలు,70దూడలకు ఉచితటీకాలు వెయ్యడం జరిగింది. సిబ్బంది. విఎల్ఓ తిరుపతమ్మ, ఏ హెచ్ ఏ మనీష్, ప్రసన్న మరియు రాజ్,లోకేష్, శ్రీకాంత్ ప్రవీణ్ ,రాఘవేంద్ర,రమేష్, పాల్గోన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - డోన్ : యువత అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజారెడ్డి అన్నారు. ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర డోన్ పట్టణంలోని విజయ్ పాలిక్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్లినిక్‌ను రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అనుకున్న రంగంలో రాణించాలంటే కష్టపడాలన్నారు. యువత అనుకున్న రంగంలో రాణిస్తే అనేకమందికి ఉపాధి, అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రైవేట్ హాస్పిటల్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సాధారణ వ్యక్తి పెద్ద ఎత్తున హాస్పిటల్ ను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. రామదుర్గం సర్పంచ్ నాగన్న, గొర్రెల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు రంగనాథమయ్యా, మాదసి కురువ సంఘం నాయకులు కెసి మద్దిలేటి,లక్ష్మన్న,పెద్దరాజులు, శివ, రవి,మల్లి, సుధాకర్ పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : గిరిజన మహిళలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి అన్నారు. బుధవారం పట్టణంలోని చక్రం హోటల్ నందు ఆత్మకూరు, కొత్తపల్లి మండల గిరిజన మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. న్యాయవాదులు శ్రీధర్ అడిగా, రంగస్వామి, ఐకెపి వెలుగు కోఆర్డినేటర్ యుసుఫ్, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వర్, ఎన్జీవో సంస్థ అధ్యక్షులు సామేలు, మల్లయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరం

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఉయ్యాలవాడ మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల వైఎస్సార్సీపి కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. మండలంలోని మాయలూరు, తుదుమలదిన్నె, హరివరం గ్రామాల్లో వైయస్సార్సీపి పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మండల వైయస్సార్సీపి బూత్ కన్వీనర్ పల్లె గురుప్రసాద్ రెడ్డి, మండల స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ ముసాని శివానందరెడ్డి, హరివరం సొసైటీ డైరెక్టర్ పల్లె మహేశ్వరరెడ్డి, మాయలూరు సర్పంచ్ జనపాల సాయిరెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు ఎర్రి శ్రీనివాస్ రెడ్డి, సింగిరెడ్డి దస్తగిరిరెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సమానత్వం కోసం ముందడుగు వేయాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : మహిళల హక్కుల సాధన కోసం ఉద్యమించి హక్కులను సాధించుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ సమితి సభ్యురాలు ఈరమ్మ,వెంకటలక్ష్మి, కృష్ణవేణిలు తెలిపారు. బుధవారం అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భారత దేశ అభివృద్ధి మహిళల పాత్ర అనే సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా ఎస్టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసన్నరాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ అమానవీయా పని పరిస్థితులకు వ్యతిరేకంగా ఉపాధి భద్రత ఎనిమిది గంటల పని, కనీస వేతనం,ఓటు హక్కు కోసం పోరు నడిపిన మహిళ స్ఫూర్తిని మనం గుర్తు చేయాల్సిన రోజు అని వారు తెలిపారు.మన స్వాతంత్రం పోరాట ఆంక్షలతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపట్టిన బిజెపి పాలకులు తిరోగమన మనస్మృతి ముందుకు తెస్తున్నారని , మరోవైపు మహిళలపై పెరుగుతున్న హింస వివక్ష లైంగిక వేధింపులు శ్రమదోపిడి అతి తక్కువ వేతనాలు ధరలు పన్నుల భారం మద్యం మొదలైన అంశాలు మహిళలకు మరింత పేదరికంలో నెట్టుతున్నాయని, చట్టసభల్లో మహిళలు రిజర్వేషన్ బిల్లు మనువాదులు పాలనలో మరుగుపడిందని, డిజిటల్ సాంకేతిక రంగాలలో లింగ సమానత్వం సాధించాలని ఐక్యరాజ్యసమితి ఏడాది పిలుపునిచ్చింది డిజిటల్ విద్యా సాంకేతిక రంగాలలోకి మహిళల ప్రవేశంతో పనిలో నైపుణ్యం ఏర్పడుతుందని అయితే సాంకేతిక విద్య అభ్యసిస్తున్న వారిలో మహిళల 30 శాతం నుంచి లేరని కరోనాలో ఆన్లైన్ విద్యకు బాలిక 60% క్లాసులు వినలేక విద్యకు దూరమైన అని ఈ సందర్భంగా వారు

తెలిపారు. నిత్య మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష అసమానతలు హింస మొదలైన సమస్యల పరిష్కారం పాటు ప్రజాస్వామ్యం లౌకిక తత్వం కాపాడాలి అంటే కులమాత తత్వాలకు వ్యతిరేకంగా అభ్యుదయ శక్తులు కలుపుకుని మహిళ దినోత్సవం 8నుంచి 15వరకు నిర్వహించాలని సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య కార్యకర్తలు నాయకురాలు ఎస్టీయూ పట్టణ కార్యదర్శి తిమ్మన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యన్నా, ఏఐటీయూసీ కార్యదర్శి బాలరాజు, తిమ్మా గురుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనుల పరిశీలన

విశాలాంధ్ర - కోసిగి : గ్రామ ప్రజల చిరకాల కోరికైన గ్రామ సమీపాన ఉన్న భూగేని చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనులను బుధవారం మండల వైసిపి ఇన్చార్జ్ మురళి మోహన్ రెడ్డి, ఎంపీపీ లవకుశ ఈరన్నలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులికనుమ రిజర్వాయర్ నుంచి త్రాగునీటిని బుగేని చెరువు నుంచి అందించేందుకు దాదాపు 37లక్షల రూపాయలతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సొంత నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు.స్టోరేజ్ ట్యాంక్ కు కరకట్ట వేయడంతో పాటు చదును పనులను ఇంకా చేయవలసిన పనులను కాంట్రాక్టర్ బసిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అతి త్వరలోనే కోసిగి గ్రామ వాసులకు ఫిల్టర్ చేయబడిన త్రాగు నీటిని అందివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, కన్వీనర్ బెట్టనగౌడ్, యన్. నాగరాజు, బుళ్ళి నరసింహులు, ప్రవీణ్ కుమార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ శకుంతలకు సన్మానం

విశాలాంధ్ర - కర్నూలు : ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా రాయలసీమ మహిళా సంఘ్ నడవబడుచున్న నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకురాలు రాయలసీమ శకుంతలను కర్నూలు సీనియర్ సిటిజన్ సంఘ ప్రతినిధులు ప్రెసిడెంట్ సహదేవ రెడ్డి, సెక్రటరీ నాగరాజు, ట్రెజరర్ క్రిస్టఫర్, సంఘ సభ్యులు రత్నారెడ్డి, చంద్రన్న, డాక్టర్ బాలేశ్వరయ్య, డాక్టర్ జయప్రకాష్, లక్ష్మన్న, పాపారావులు సన్మానించారు. బుధవారం ప్రపంచమహిళా దినోత్సవం సందర్భంగా నిరాశ్రయ వసతి గృహంలో ఆమెకు సన్మాన చేయడం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా సహదేవరెడ్డి మాట్లాడుతూ.. నిరాశ్రయులకు సేవ చేయడం గొప్ప విషయం అన్నారు. పరిసరాలు పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. నాగరాజు,క్రిష్టఫర్‌లు మాట్లాడుతూ. ఇక్కడ అందరూ మహిళా నిరాశ్రయులకు ఆమె చాలా సేవలు చేస్తుంది అన్నారు. మీరు అందరూ కలిసిమెలసి అనాథలము అనే ఫీలింగ్ లేకుండా సంతోషంగా ఉండాలన్నారు. ఇక్కడ కులమతాలకు అతీతంగా ఈ వయసులో మీరు ప్రతి రోజు దేవుణ్ణి ఆరాధించాలని.. ఏ మతమైనా దేవుని ప్రార్థించడం వల్ల మన మనసుకు శాంతి కలుగుతుంది అన్నారు. ఇక్కడ అవసరమైన రక్త పరీక్షలు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శకుంతలకు అండగా ఉంటామని అన్నారు. ఆమె చేసే కార్యక్రమాలు మేము రోజు చూస్తుంటాము. మేము కూడా మీకు సహాయ సహకారాలు అందిస్తాము అన్నారు. పాపారావు మాట్లాడుతూ మీకు పిల్లలు ఉన్న వారికి దూరంగా ఉంటున్నారు. మీ ఆలనా పాలనా చిన్నమ్మ లాంటి శకుంతలమ్మ చూసుకోవడం సంతోషకరమన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా చిన్నమ్మ శకుంతలమ్మను మా కమిటీ సభ్యులు సన్మానం, మరియు నిరాశ్రయులకు భోజనం పంపిణీ చేశారు. శకుంతల మాట్లాడుతూ...సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా నాకు సన్మానం చేయడం చాలా సంతోషకరమని అన్నారు.అందులోనూ సీనియర్ సిటిజన్స్ అందరూ పెద్దవాళ్లు, చాలా అనుభవాలు ఉన్నవాళ్లు, నా తండ్రి లాంటి వాళ్ళచే సన్మానం చేయించుకోవడం చాలా సంతోషకరమన్నారు. సీనియర్ సిటిజన్ సంఘం కమిటీ సభ్యులు నిరాశ్రయులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థిని గెలిపిద్దాం

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి బలపరిచిన భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని బుధవారం భాష్యం,శ్రీ చైతన్య, సి.మల్లికార్జున పాఠశాలలో టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జి గుడిసి కృష్ణమ్మ, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ సూరం భాస్కర్‌రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప నాయకులను కార్యకర్తలను కలుపుకొని విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌ఎల్సీ మాజీ చైర్మన్ బసాపురం రామస్వామి, వడ్డేమాన్ గోపాల్,సోమశేఖర్ రెడ్డి, షేక్షావలి, మల్లికార్జున, మల్లేష్ ,శ్రీనివాసులు,రాముడు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

విశాలాంధ్ర - దేవనకొండ రూరల్ : మండల పరిధిలోని పి. కోటకొండ గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి స్థానిక ఎస్సై భూపాలుడు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సుంకులమ్మ, మారమ్మ దేవర ఉత్సవాలకు ఆ గ్రామానికి చెందిన బోయ లింగన్న అల్లుళ్ళు జయరాముడు, రవి, సూర్య ప్రకాష్ వచ్చారు. క్రిష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన సూర్య ప్రకాష్(23)అనే వ్యక్తిని మామ లింగన్న, తోడు అల్లుళ్ళు రామళ్లకోటకు చెందిన జయరాముడు, రవి అనే వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు వివరించారు. ఈ హత్యకు అక్రమ సంబంధమే కారణం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా హోళీ

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుందలో యువకులు ప్రజలు హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. హోలీ పండుగ సందర్భంగా మజ్జిగ బండి,తెల్లా నల్ల ఏనుగుల ఊరేగింపు, బైలాట వేషాధారణలు, ఓడరేవుల ఒంటెల ఊరేగింపుల, వేషధారణలు చిన్నపిల్లలు వేసిన దేవుళ్ళ వేషాదరణ ఊరేగింపు కార్యక్రమాన్ని గ్రామ పెద్ద రాజా పంపనుగౌడ్, ఎస్ఐ అబ్దుల్ జహీర్ పూజలు చేసి ప్రారంభించారు.ఉదయం శవయాత్ర నిర్వహించి కామ దహన సంస్కార కార్యక్రమాలు ఘనంగా కామదేవుని పునర్జన్మ కార్యక్రమాన్ని యువకులు వైభవంగా నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా యువకులు గ్రామంలో కేరింతలు కొడుతూ తప్పెట్లతో ఊరేగిస్తూ స్నేహితు లకు బంధుమిత్రులకు రంగును పూజిస్తూ ఎంతో ఆనందంతో పండుగను జరుపుకున్నారు.రంగులు చల్లి, రంగులు పూయించి ,హోలీ పండుగను ఘనంగా జరిపారు. హోలీ పండుగ సందర్భంగా ఐదు రోజులపాటు యువకులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు ప్రజలకు ఎంతో ఆకట్టుకున్నాయి. ఎస్సై అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందో బస్తు నిర్వహించారు. జాంటీ వీరేష్,కాత్రేష్ డిష్,మంజునాథ్ ,మల్కప్ప, ఈశ్వరప్ప, రేణుకారాధ్య స్వామి, రాజా పంపనగౌడ్, జి బసవరాజ్, శివన్న గౌడ్, సిద్ధార్థ గౌడ్, ఈరన్నగౌడ్, సిద్దప్ప ప్రజలు యువకులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్న సోమేశ్వరుడి వసంతోత్సవం

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో చెన్న సోమేశ్వర స్వామి వసంతోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం ఆలయ పూజారులు సోమేశ్వర స్వామి, పార్వతీదేవి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం విగ్రహాలను ఆలయానికి చేర్చి విగ్రహాలపై బుక్క పిండి చల్లడం జరిగింది. మధ్యాహ్నం ఆలయ ప్రధాన అర్చకుడు ఉత్సవ కంకణాల వితరణ ను శాస్త్రోత్సంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి విగ్రహాలను అమ్మవారి బావి దగ్గరకు తీసుకువెళ్లి చక్రస్నానం చేయిస్తారు.దీంతో చెన్న సోమేశ్వర స్వామి ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

ఉత్సవాలో సందడే సందడి : గత వారం రోజుల నుండి గ్రామంలో జరుగుతున్నటువంటి చెన్న సోమేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఏర్పాటు చేసినటువంటి మిఠాయి అంగళ్ళు, బొమ్మల అంగళ్ళు మరియు రంగుల రాట్నాలు, పిల్లలు ఊగే ఉయ్యాలలు తదితర వాటితో ప్రజలను మరియు పిల్లలను ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు గ్రామానికి వచ్చిన భక్తులు మరియు బంధువులు తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన అంగళ్లలోని వస్తువులపై

భక్తులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, ముఖ్యంగా మహిళలు గాజులు చిన్నారులు ఆట వస్తువులు తదితర గృహోపకరణాల కొనుగోలుకు ఆసక్తి కనపరిచారు. స్వామివారి వసంతోత్సవ సందర్భంగా గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు తదితరులు ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీతోనే అందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : వైసీపీ ప్రభుత్వం తోనే అందరికీ సంక్షేమ పథకాలు సాధ్యమని వైకాపా రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్లుగా వైసీపీ పాలన సాగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 4లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశారన్నారు. కావున వైసీపీ బలపరచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి వెన్నెపూస రవీంద్రారెడ్డిని బలపరచాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, సర్పంచులు రామాంజనేయు లు, ఇస్మాయిల్, నాయకులు రవిచంద్రారెడ్డి, గజేంద్ర రెడ్డి, విజయేంద్ర రెడ్డి, పూజారి ఈరన్న, జాము మూకన్న, శివరామిరెడ్డి, నవీన్ రెడ్డి, వీరసేనారెడ్డి, తిక్కన్న, ముక్కరన్న, అర్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యం కలిగి, దృఢచిత్తంతో ముందుకు సాగితేనే అన్ని రంగాల్లో విజయం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : మహిళలు ఆత్మస్థైర్యం కలిగి, దృఢచిత్తంతో ముందుకు సాగితేనే అన్ని రంగాల్లో విజయం వరిస్తుందని కర్నూలు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రమాదేవి సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు జ్యోతి నేతృత్వంలో నగరం లోని కేవీఆర్ కాలేజీలో మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్, కేవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, డాక్టర్లు సుహాసిని, సుధారాణి, మెప్మా పిడి నాగశివలీల, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగలక్ష్మిదేవిలు పాల్గొన్నారు. మహిళల కు స్వేచ్ఛ, హక్కులు అనేవి పోరాడి సాధించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటలపోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. మహిళా ఉద్యోగులు సోమేశ్వరి, విజయశ్యామలత, అశ్విని, సరస్వతి, కమలప్రియ, మమత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలూ అన్ని రంగాల్లో ముందున్నారు : దేశంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సమాజ నిర్మానంలో భాగస్వాములుగా ఉన్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మాధవ నగర్ లోని నారాయణ పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ అధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా మహిళ టీచర్స్‌కు క్రీడా పోటీలు నిర్వహించారు. ఆర్ఐ దుర్గాలక్ష్మిలు,కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, రెహానా, అరుణ, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి మహిళా చైతన్యవంతం కావాలి : ప్రతి మహిళా చైతన్యవంతం కావాలని, అప్పుడే దేశ ప్రగతి సాధ్యపడుతుందని -ఎస్. వి విజయ మనోహరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, ఎస్. వి సుబ్బారెడ్డి ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో మాజీ కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి స్వగృహం దగ్గర అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భవన నిర్మాణ మహిళా కార్మికులతో కేకు కట్ చేయించి అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాయపాటి శ్రీనివాస్, లయన్ రాయపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ,పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ, కర్నూలు నగర మేయర్ రామయ్య,డిప్యూటీ మేయర్ రేణుక,నగరంలోని పలువురు కార్పొరేటర్లు, మహిళా నాయకురాళ్లు. కర్నూలు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,నగర మేయర్ బీవై.రామయ్య,కర్నూలు నగర మాజీ ఎమ్మెల్యే ఎస్వి మోహన్ రెడ్డి సతీమణి విజయమనోహరి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ముందుగా కేక్ కటింగ్ చేసి "మహిళామణులకు" అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఎమ్మెల్యే ,మేయర్ .అనంతరం రంగులు పూసుకుని హోలీ వేడుకలు జరుపుకున్నారు.మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు.ఈ వేడుకల్లో...నగరంలోని పలువురు మహిళా కార్పొరేటర్లు, మహిళా నాయకురాళ్లు మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- పత్తికొండ : మహిళలతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళా సర్పంచులు, వైఎస్ఆర్సిపి నాయకులు ఎమ్మెల్యే శ్రీదేవిని పూలమాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మరియు పోచమిరెడ్డి సేవాదళ్ కార్యాలయంలో పోచం రెడ్డి మురళీధర్ రెడ్డి మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి, పది మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

విశాలాంధ్ర - హొళగుంద : ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం సీజనల్ హాస్టల్ నందు మహిళల ఉద్దేశించి ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ చిన్న హట్ట నాగరాజు, మైనారిటీ నాయకులు బి.ఎం.అమీర్ సాబ్ మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులు ఉన్నాయని అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలన్నారు. రాజకీయ, ఉద్యోగ, కార్మిక రంగాల్లో మహిళా శక్తిని గమనించి సమాన హక్కులు కల్పించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయన్నారు, స్త్రీ తక్కువ పురుషుడు ఎక్కువ అనే భావనని విడనాడాలని మహిళలకు సూచించారు. స్త్రీ లేనిదే ఈ ప్రపంచంలో సృష్టి లేదన్నారు, మహిళలు ప్రతి రంగంలో పురుషులతో సమానంగా పోటీ పడటం గర్వంగా ఉందన్నారు. మహిళలు బాల్య వివాహాలు తగ్గించడానికి స్వచ్ఛం దంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలికలను మహిళలను పురుషులు ప్రజలు చిన్నచూపు చూడడం తగదని అన్నారు. దేశ అత్యున్నత పదవిలో రాష్ట్రపతిగా మహిళా నేత ద్రౌపది ముర్ము కొనసాగడం హర్షించదగ్గ విషయ మన్నారు. మహిళలు మానసికంగా ఆర్థికంగా ఆరోగ్యంగా దృఢంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు .బాలికల చదువుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రోత్సహిస్తున్నాయని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .మహిళల వివక్ష చూపడం తగదని మహిళలను పురుషులతో పాటు సమానంగా గౌరవించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు పెన్ను లను మహిళలు బహుమతులను పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అలాగే ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - మహానంది : నంద్యాల జిల్లా మహానంది మండలం అబ్బీపురం గ్రామంలోని గిరిజన కాలనీలో. నివసించే ఐదు కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని గత ఆరు నెలలుగా ఎమ్మార్వోకు వినతి పత్రాలు ఇచ్చిన స్పందించకపోవడం లేదని సిపిఐ మహానంది మండల కార్యదర్శి వీరప్ప. జిల్లా సమితి సభ్యులు సామేలు అన్నారు. గిరిజన కుటుంబాలకు కనీసం ఇప్పటికైనా ఎమ్మార్వో గారు స్పందించి వీరికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మార్వో గారు స్పందించిన యెడల. నంద్యాల జిల్లా కలెక్టర్ గారికి మరియు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మరియు ఎస్టీ చైర్మన్ అండ్ కమిషన్ గారిని కలిసి వినతి పత్రాలు. అందజేస్తామని సిపిఐ పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపైప్రమాదకరంగా మారిన కల్వర్టు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోనివిద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నంద్యాల జిల్లా జాతీయ రహదారి లో రక్షణ గోడా కూలి కల్వర్టు ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పై ఉన్న రక్షణ గోడ కూలి చాలా కాలమైన సంబంధితఅధికారులు మాత్రం పట్టించుకోలేదు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రెండు వరుసల జాతీయ రహదారిలో బ్రిడ్జి దగ్గర ఏ ప్రమాదం ఎప్పుడు ముంచుకొస్తుందోనని ఆందోళన వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంత రెండు వరుసల రహదారి ఉండి కల్వర్టుపై మాత్రం ఒకే వరుస సిమెంట్ రోడ్డు ఉండడంతో అటు ఇటు వెళ్లే వాహన దారులు అయోమయానికి గురవుతున్నారు. ఇతర ప్రాంతాల వాహనదారులు ఒకే వరుస రహదారి తెలియక వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టుపై రెండు వరుసల రహదారి నిర్మించే టంతా స్థలం ఉన్నప్పటికీ ఒకే వరుస వేయడంతో ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. ఉన్న ఒకే వరుస సిమెంట్ రోడ్డు కి ఇరువైపులా గుంతల మయం కావడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఒకవైపు రక్షణ గోడా కూలిపోవడంతో ఎక్కడ కల్వర్టు నుండి పది అడు గుల లోతు ఉన్న వంకలోకి పడతామేమోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిపై రక్షణ గోడ ఏర్పాటు చేసి, రెండు వరసల రహదారిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.